సాక్షి నారాయణపేట
ఆదివారం ǀ 24 ǀ నవంబర్ ǀ 2024



పల్లెలకు ట్రెయినీ అధికారులు

మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామాలను శిక్షణ అధికారుల బృందం సందర్శించింది.

వివరాలు 8లో ▸



గోవింద నామస్మరణ

భక్తుల గోవింద నామస్మరణతో కురుమూర్తిగిరులు మార్మోగాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /12.5

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం, రాత్రివేళ చలి ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు

నారాయణపేట: జిల్లాలో **ఇప్పటికే ఉన్న** ప్రభుత్వ వైద్య కళాశాలకు **అనుబంధంగా** నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు **వైద్య ఆరోగ్య** కుటుంబ సంక్షేమ శాఖ **పరిపాలనవరమైన** అనుమతులను మంజూరు **చేస్తూ జీఓ ఎంఎస్** నంబర్ 183 ద్వారా ఉత్తర్వు**లను జారీ చేసిం**ది. నూతనంగా ఏర్పాటు చేసే **నర్సింగ్ కళా**శాలలో 60 మంది విద్యార్థులను చేర్చుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు రూ.26 కోట్ల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేసింది.

మక్తల్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు



మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం మక్తల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. శనివారం మక్తల్‌లో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 26 ఇంటిగ్రెటెడ్ స్కూళ్లు మంజూరు చేయగా అందులో మక్తల్‌కు సైతం మంజూరైందని, ఈ స్కూళ్లలో 2500 మంది విద్యార్థుల సామర్థ్యంతో.. కేజీ నుంచి పీజీ వరకు చదివే అవకాశం ఉందని అన్నారు. ఈ పాఠశాలను మక్తల్ మండలం గొల్లపల్లి సరిహద్దులో దాదాపు 20 ఎకరాల్లో నిర్మించనున్నట్లు, త్వరల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీద పనులకు ప్రారంభోత్సవం చేసుకుందామని అన్నారు. పాఠశాల మంజూరు చేయడంపై సీఎం, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్టారెడ్డి, నాయకుల లక్ష్మారెడ్డి,చంద్రకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నారాయణపేట జిల్లా కోస్గిలోని చౌరస్తాలో జాతీయ రహదారి-167 డివైడింగ్ కారణంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ మార్చడం వల్ల ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల పాటు నీళ్ల సరఫరా బంద్ చేయనున్నట్లు మిషన్ భగీరథ ఈఈ వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా కోస్గి మున్సిపాలిటీ, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూరు మండలాలకు నీళ్ల సరఫరా నిలిచిపోతుందని, ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

26న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 26వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 విభాగం బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనేవారు పాఠశాల బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం పీడీలు నాగరాజు (99592 20075), రాఘవేందర్ (99590 16610) నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యాశాఖలో గందరగోళం

డీఈఓల బదిలీపై వెల్లువెత్తుతున్న విమర్శలు



నారాయణపేట డీఈఓ కార్యాలయం

- మాగనూరు విద్యార్థుల అస్వస్థత ఘటనకు బాధ్యులెవరు..?
- డీఈఓ అబ్దుల్ ఘని సస్పెన్షన్ కాదు.. బదిలీ అని తేలిన వైనం
- రెండుసార్లు ఉత్తర్వుల జారీతో విద్యాధికారుల్లో అయోమయం
- 'పేట'కు బదిలీపై వచ్చేందుకు డీఈఓ గోవిందరాజులు అనాసక్తి
- సీఎం ఇలాకా కావడంతో వెళ్లాలంటున్న ఉన్నతాధికారులు

నారాయణపేట/వనపర్తి: జిల్లా విద్యాశాఖ అధికారుల బదిలీలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాలయాల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, పాఠశాలల్లో సౌకర్యాల విషయంలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా డీఈఓలు బాధ్యతతో విధులు చేపట్టాల్సి ఉంది. అయితే నారాయణపేట జిల్లా మాగనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇటీవల మధ్యాహ్న భోజనం వికటించి దాదాపు వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఆ మరుసటి రోజు చోటుచేసుకున్న కొన్ని ఘటనల నేపథ్యంలో డీఈఓను సస్పెండ్ చేయడంతో పాటు.. మరో ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఓ జిల్లా అధికారి పేర్కొన్నారు. కానీ, మూడు రోజులకే సదరు డీఈఓను వనపర్తి, జోగుళాంబ గద్వాల డీఈఓగా బదిలీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'పేట'కు వచ్చేందుకు గోవిందరాజులు అనాసక్తి?

ఇదిలా ఉండగా, నాగర్‌కర్నూల్ డీఈఓగా విధులు నిర్వహిస్తున్న గోవిందరాజులును మొదటగా నారాయణపే డీఈఓగా బదిలీ చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా అతను నారాయణపేటకు వచ్చేందుకు విముఖత చూపుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తనకు మహబూబ్‌నగర్, నారాయణపేట రెండూ ఇస్తే చేస్తానని, లేదంటే డైట్ కళాశాలకు వెళ్లిపోతానంటూ ఉన్నతాధికారులకు చెప్పినట్లు సమాచారం. అంతకుముందు రోజు వెలువడిన ఉత్తర్వులో డీఈఓ గోవిందరాజులుకు నారాయణపేట, జోగుళాంబ గద్వాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ కాగా, పలు సమీకరణాల నేపథ్యంలో వనపర్తితో పాటు జోగుళాంబ గద్వాల బాధ్యతలు డీఈఓ అబ్దుల్ ఘనికి కేటాయించి, కేవలం నారాయణపేట బాధ్యతలు గోవిందరాజులకు కేటాయించారు. ఈ విషయం జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకు వద్దకు చేరినట్లు సమాచారం. మొత్తానికి డీఈఓగా గోవిందరాజులు పేట డీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తారా లేక అక్కడే ఉండిపోతారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

చర్యలు కాదు.. ప్రోత్సాహం

మాగనూరు పాఠశాల ఘటనపై సంబంధిత డీఈఓతో సంజాయిషీ కోరడం.. చర్యలు తీసుకోవటం వదిలేసి వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాకు బదిలీపై పంపించడం ఏమిటనే ప్రశ్నలకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జవాబు చెప్పాల్సి ఉందని విద్యావంతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా మంత్రి, వనపర్తి, గద్వాల జిల్లాల ఎమ్మెల్యేలు స్పందించకపోవడంతో విద్యాశాఖలో పనిచేసే అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సస్పెన్షన్ కాదు.. బదిలీ

నారాయణపేట జిల్లా మాగనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం విద్యార్థులు మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆ మరుసటి రోజు గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు డీఈఓ అబ్దుల్ ఘని పాఠశాలకు చేరుకొని దగ్గరుండి వంట చేయించారు. కానీ, ఆ అన్నంలోనూ పురుగులు రావడం, మేం తినలేమంటూ విద్యార్థులు ఆహారం పారబోసి ఆందోళనకు దిగడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ బెన్ షాలం అక్కడికి వెళ్లి ఘటనకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆరా తీశారు. ఆ తర్వాత డీఈఓ అబ్దుల్ ఘనిని సస్పెండ్ చేస్తున్నట్లు విలేకర్ల ఎదుట వెల్లడించారు. కానీ, శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం నుంచి డీఈఓ అబ్దుల్ ఘనీని వనపర్తి జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతటితో కాకుండా శనివారం మరో ఉత్తర్వులు జారీ చేశారు. అందులో వనపర్తి జిల్లాతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లా డీఈఓగా అదనంగా అబ్దుల్ ఘనీకి బాధ్యతలు అప్పగించడం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



24వ తేదీతో ముందుగా డీఈఓలను బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వు



22వ తేదీతో మార్పు చేస్తూ మళ్లీ జారీ అయిన ఉత్తర్వు

విద్యాశాఖలో రాజకీయమా?

సుమారు వంద మంది విద్యార్థులు అస్వస్థత పాలైన ఘటనపై నైతిక బాధ్యత వహించాల్సిన అధికారిపై చర్యలు తీసుకోకుండా బదిలీ పేరుతో రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించటంతో విద్యాశాఖలో రాజకీయం ఏస్థాయిలో ఉందోనంటూ ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల అస్వస్థత ఘటనపై సరిగా స్పందించకపోవడం, రెండో రోజూ పురుగుల అన్నం పెట్టేంత పర్యవేక్షణ లోపం కారణంగా డీఈఓ అబ్దుల్ ఘని సస్పెండ్ కాగా.. తిరిగి ఆయనకే రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించడం ఏమిటనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమతున్నాయి. అయితే, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల డీఈఓగా గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న గోవిందరాజులును నారాయణపేట జిల్లాకు కేటాయించిన విషయం తెలిసిందే.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి



దివ్యాంగుల క్రీడా పోటీలను తిలకిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: దివ్యాంగులను ఎవరు చిన్నచూపు చూడవద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులలోనూ ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, ఏ పరిస్థితుల్లో వెనుకడుగు వేయక క్రీడలు, ఉద్యోగ, ఇతర రంగాల్లో రాణించాలన్నారు. కాగా జూనియర్, సీనియర్స్, బాయ్స్, గర్ల్స్ విభాగాలలో షాట్ పుట్, రన్నింగ్, చెస్, క్యారం పోటీలను నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి దాదాపు 100 మంది దివ్యాంగులు వారి సహాయకుల వెంబడి వచ్చి క్రీడా పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేష్, డీపీఆర్ఓ రషీద్, జిల్లా అధికారులు వెంకటమ్మ, జయ తదితరులు పాల్గొన్నారు.

'సర్వే' ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఫారాలలోని వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో కొనసాగుతున్న డేటా ఎంట్రీని కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ సమయంలో ఎన్యూమరేట్ అందుబాటులో ఉండాలని, సర్వే ఫారాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా భద్ర పరచాలన్నారు. వీలైనన్ని కంప్యూటర్లు, ల్యాబ్ ట్యాప్‌లను సమకూర్చుకుని స్థానిక చిట్టెం నర్సిరెడ్డి డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి డేటా ఎంట్రీని నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు.

భోజనంలో నాణ్యత లోపించొద్దు

విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతలో రాజీ పడొద్దని.. నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ నిర్వాహకులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం ఉదయం 6.50 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలురు, బీసీ కళాశాల బాలురు, బాలికల వసతి గృహాలను సందర్శించి వంట గదులు, ఆహార పదార్థాలను, స్టోర్ రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు తనిఖీ చేరుశారు. విద్యార్థులతో అల్పాహారాన్ని భుజించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు
- విద్యార్థుల అవగాహన సదస్సులో ఎస్పీ యోగేష్ గౌతమ్



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

కోస్గి: కొందరు యువత డ్రగ్స్ అలవాటు చేసుకొని మత్తుకు బానిసలుగా మారి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్‌ను సంపూర్ణంగా నిర్మూలించడం ఓ సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని, ముఖ్యంగా డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థిలోకం నడుం బిగించాలని ఎస్పీ యోగేష్ గౌతం సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ క్రైం, ర్యాగింగ్‌లపై కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధానికి ఎంతో ప్రాముఖ్యతనిస్తూ డ్రగ్స్ కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా కొందరు ముఠా డ్రగ్స్‌ను అలవాటు చేసి తమ వ్యాపారం మొదలు చేస్తారని, విద్యార్థులను అప్రమత్తం చేసి అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ తరపున చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎవరైన ర్యాగింగ్ చేస్తే భయపడకుండా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, డ్రగ్స్‌పై సైతం అప్రమత్తంగా ఉంటూ తమను తాము కాపాడుకుంటూనే చుట్టుపక్కల ఎవరూ డ్రగ్స్‌కు అలవాటు కాకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. శిక్షణ కలెక్టర్ గరిమా నరుల మాట్లాడుతూ కష్టపడి చదివితే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చునని, తాను కష్టపడి చదివి కలెక్టర్ స్థాయి వరకు చేరుకున్న అంశమే ఇందుకు ఉదాహరణగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎంఈఓ శంకర్ నాయక్, సీఐ దస్రూ నాయక్, ఎస్సై బాల్‌రాజ్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ రూ.2,829

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో ధాన్యం ధరలు ఎగబాకుతున్నాయి. శనివారం మార్కెట్ యార్డులో ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ గరిష్టంగా రూ.2,829, కనిష్టంగా రూ.1,506 ధరలు దక్కాయి. అలాగే మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,421, కనిష్టంగా రూ.2,011, హంసరకం గరిష్టంగా రూ.1,929, కనిష్టంగా రూ.1,837, పత్తి గరిష్టంగా రూ.6,690, కనిష్టంగా రూ.6,060, వేరుశనగ గరిష్టంగా రూ.6,690, కనిష్టంగా రూ.5,680 ధరలు లభించాయి.

27 నుంచి ఓపెన్ పీజీ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఓపెన్ పీజీ పరీక్షలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ఫీజు రిసిప్టు, ఐడీ కార్డు తీసుకురావాలని, వివరాలకు సెల్ నం.73829 29609ను సంప్రదించాలని సూచించారు.

సేవే పరమావధిగా..!

ఉమ్మడి రాష్ట్రంలోని ఆలయాల్లో సేవలందిస్తున్న పాలమూరు వాసులు



మహానంది ఆలయ హుండీ లెక్కింపులో ఉమ్మడి పాలమూరు మహిళలు (ఫైల్)

- ఆధ్యాత్మిక చింతన, సేవాభావమే లక్ష్యంగా...
- మహిళల భాగస్వామ్యమే అధికం



భద్రాచలంలో లడ్డూ ప్రసాదాలను ప్యాకింగ్ చేస్తూ..

సండే స్పెషల్

గండేడ్: గుడికి వెళ్లి భజన చేయడమే కాదు.. సేవ చేయడంలోనూ తాము ముందుంటామని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి పాలమూరు వాసులు. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో తమకు చేతనైన పని చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో పాటు సేవా తత్పరతను చాటుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మహమ్మదాబాద్, గండేడ్, మక్తల్, నర్వ, ధన్వాడ, వనపర్తి, దేవరకద్ర, మహబూబ్‌నగర్ తదితర మండలాల వారు అత్యధికంగా సేవల్లో పాల్గొంటున్నారు. భ్రమరాంభిక సేవాసమితిలో ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మందికిపైగా సేవకులు నమోదై ఉన్నారు. 20 నుంచి 30 మంది సేవకులు బృందంగా ఏర్పడి ఆలయాల్లో ఒకరోజు మొదలు ఐదు, ఏడు, 15 రోజుల పాటు వివిధ రకాల సేవలు అందిస్తుంటారు. ఆలయాల్లో సేవలకు సంబంధించిన సమాచారాన్ని భ్రమరాంభిక సేవాసమితి వారు ప్రత్యేకంగా రూపొందించిన 'శ్రీవారి సేవ' వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేస్తారు. ఆసక్తిగల సేవకులు సేవా సమితి వారిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకుంటారు. అనంతరం సేవాసమితి వారు ఆయా ఆలయాల వారికి సేవకుల వివరాలు పంపిస్తారు. సేవకులు సొంత ఖర్చులతో ఆలయాలకు వెళ్లగా.. వసతి, భోజన సదుపాయం దేవస్థానం వారు కల్పిస్తారు.

ప్రధాన ఆలయాల్లో..

ఉమ్మడి జిల్లావాసులు ఎక్కువగా తిరుమలలో సేవకు వెళ్తుంటారు. అక్కడ భోజనం వడ్డించడం, హుండీ లెక్కింపు, లడ్డూలు ఇతర ప్రసాదాల ప్యాకింగ్, కూరగాయలు కోయడం, దర్శనానికి వచ్చిన భక్తులను వరుస క్రమంలో పంపించడం, ఆయా ఆలయాలకు సంబంధించిన ఆధ్యాత్మిక పుస్తకాలు విక్రయించడం, పూలదండల తయారీలో సాయం చేయడం వంటి పలురకాల సేవల్లో పాల్గొంటారు. శ్రీశైలం, పుట్టపర్తి, యాదగిరిగుట్ట, మహానంది, భద్రాచలం, విజయవాడ, వేములవాడ, స్వర్ణగిరి, అన్నవరం, బ్రహ్మంగారి మఠం, సమ్మక్క-సారక్క, కొండగట్టు, మంత్రాలయం తదితర ఆలయాల్లోనూ సేవలకు మహిళలు, పురుషులు వెళ్తున్నారు. సేవలకు వెళ్లిన వారికి అక్కడి ఆలయ అధికారులు మొదటి, చివరిరోజు ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దీంతో సేవ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. మరికొందరు నేరుగా ఆయా ఆలయాలకు వెళ్లి సేవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సేవ కార్యక్రమాల్లో అత్యధికంగా మహిళలే పాల్గొంటున్నారు. పురుషులు మాత్రం తక్కువ సంఖ్యలో ఉంటున్నారు.



తిరుపతి అన్నదాన సత్రంలో అరటి ఆకులను సిద్ధం చేస్తున్న మహిళలు



వేములవాడలో కూరగాయలు కోస్తూ..

12 ఏళ్లుగా వెళ్తున్నా..



నేను వ్యవసాయంతో పాటు టైలరింగ్ చేస్తా. ఆలయాల్లో సేవ చేయాలనే సంకల్పం ఉండేది. భగవంతుడి కృపతోనే ఈ భాగ్యం దక్కింది. ఎక్కడ అవకాశం లభిస్తే అక్కడికి వెళ్లి సేవ చేసి వస్తున్నా. ఇప్పటివరకు అన్నవరం, సమ్మక్క సారక్క, శ్రీశైలం, యాదగిరిగుట్ట తదితర ఆలయాల్లో వివిధ రకాల సేవలు చేశా. రోజూ నాలుగు నుంచి ఆరు గంటల వరకు సేవ చేయాల్సి ఉంటుంది. సేవలను బట్టి టైమింగ్స్ ఉంటాయి. 12 ఏళ్లుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా.

– స్వాతి, ఉండెకోడు, నర్వ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాల్లో..



భ్రమరాంభిక సేవాసమితి ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో సేవల్లో పాల్గొంటున్నాం. సేవకులు అవసరం ఉన్నప్పుడు ఆలయాల వారు సమాచారం ఇస్తారు. మేము వెంటనే మా వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేస్తాం. ప్రస్తుతం కురుమూర్తి, మన్యంకొండలతో పాటు రెండు రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాల్లో పలువురు సభ్యులు సేవలు అందిస్తున్నాం. ఇప్పటి వరకు వేల మంది భక్తులు సేవల్లో పాల్గొన్నారు.

– మాలె శ్రీరాములు, అధ్యక్షుడు భ్రమరాంభిక సేవాసమితి, పల్లెగడ్డ, మరికల్

సేవ చేయడం సంతృప్తినిస్తుంది..



దైవసన్నిధిలో సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుంది. తిరుపతిలో సేవకు రెగ్యులర్‌గా వెళ్తున్నా. హుండీ లెక్కింపు, భక్తులను క్యూలైన్‌లలో పంపించడం, పూలు అల్లడం తదితర సేవల్లో పాల్గొన్నా. మొదటి, చివరిరోజు ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. స్వామివారిని తనివితీరా చూసేందుకు గర్భగుడి ఎదుట సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టం. సేవ అనంతరం ప్రత్యేక దర్శనం ఇవ్వడంతో పాటు ప్రసాదం కూడా ఇస్తారు. ఎప్పుడు అవకాశం వచ్చినా వెళ్తున్నా.

– దిడ్డికాడి సునీత, మహమ్మదాబాద్

జన్మజన్మల పుణ్యఫలం..



నేను ఆశా కార్యకర్తగా పనిచేస్తున్నా. మొదట మా వీధిలో ఉన్న వారు తిరుపతిలో సేవకు వెళ్తే వారివెంట వెళ్లా. తర్వాత భ్రమరాంభిక సేవాసమితి ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సేవలకు వెళ్తున్నా. ఇప్పటి వరకు యాగంటి, భద్రాచలం, శ్రీశైలం, అరుణాచలం, మంత్రాలయం, తిరుపతి తదితర ఆలయాల్లో సేవచేశా. ఆలయాల్లో సేవ చేసే అవకాశం లభించడం జన్మజన్మల పుణ్యఫలం.

– కవిత, దేవరకద్ర

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


రమేష్ నాయక్ (ఫైల్)

నవాబుపేట: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన నవాబుపేట మండలం నీర్సాబ్‌తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ విక్రమ్ వివరాల మేరకు.. నీర్సాబ్‌తండాకు చెందిన రైతు రమేష్ నాయక్ (37) శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పొలంలో వరిపంటకు నీరు పారించేందుకు బోరుమోటారు ఆన్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన సమీప పొలాల రైతులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారి సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి భార్య నేనావత్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య కథనం మేరకు.. తాండూర్‌కు చెందిన సంపత్‌ప్రసాద్(39) శుక్రవారం మహబూబ్‌నగర్ పోస్టాఫీస్‌లో కుమార్తె పేరున ఖాతా తెరిచేందుకు వచ్చాడు. పని ముగించుకొని వీరన్నపేటలో ఉండే సమీప బంధువు ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి నడుచుకుంటూ బ్రహ్మణవాడి వైపు వస్తూ దయానంద విద్యామందిర్ సమీపంలో ఉన్న పెద్ద డ్రైనేజీలో పడిపోయాడు. అప్పటికే మద్యం మత్తులో ఉండటంతో తల భాగం మురుగు నీటిలో కూరుకుపోవడంతో మృతిచెందాడు. శనివారం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మృతదేహం లభ్యం

చిన్నంబావి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నంబావి మండలంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ ఎం.కృష్ణ వివరాల ప్రకారం.. వెలగొండ శివారులోని పెబ్బేర్ ప్రధాన రహదారి పక్కన గుంతలో వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి ఒంటి బ్లూ కలర్ టీ షర్ట్, గోదుమ కలర్ ప్యాంట్ ఉన్నట్లు పేర్కొన్నారు. 33 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670618, 8712670611 నంబర్లను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- జనసంద్రంగా మారిన కురుమూర్తిగిరులు
- దర్శనానికి బారులుతీరిన భక్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తిరాయ గోవిందా.. గోవింద అనే నామస్మరణతో కురుమూర్తిగిరులు మార్మోగాయి. పాలమూరు ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు గండదీపాలు మోసి పచ్చిపులుసు, అన్నం నైవేద్యంగా సమర్పించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన జాతర మైదానంలో వెలసిన మిఠాయి, ఆట సామగ్రి, గాజుల దుకాణాలు, హోటళ్లలో భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ..

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామిని శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనానంతరం శేషవస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కురుమూర్తిస్వామి ఆలయం పాలమూరు జిల్లాలో ఉండటం అదృష్టమన్నారు. స్వామివారి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలని కోరారు. అలాగే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా ప్రధాని మోదీకి స్వామివారి ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట బీజేపీ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


జాతర మైదానంలో రద్దీ


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

పల్లెలకు ట్రెయినీ అధికారులు


పోలేపల్లికి వచ్చిన ట్రెయినీ అధికారుల బృందానికి స్వాగతం పలికిన అధికారులు, గ్రామస్తులు

- ఘనస్వాగతం పలికిన ప్రజలు

జడ్చర్ల టౌన్/నవాబుపేట/కోయిల్‌కొండ/దేవరకద్ర: జిల్లాలోని పలు గ్రామాలను శనివారం ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్, ఐసీఎస్, ఐఎఫ్ఓ, ఐసీఎల్ఎస్ అధికారుల బృందం సందర్శించింది. మొత్తం 25 మంది ట్రెయినీ అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, నవాబుపేట, కోయిల్‌కొండ మండలాల్లోని గ్రామాలకు చేరుకున్నారు. నాలుగు రోజులపాటు వారు ఆయా గ్రామాల్లోనే ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును అధ్యయనం చేయనున్నారు. జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామాన్ని పారుల్‌సింగ్ (ఐఈఎస్, ఢిల్లీ), ఆదిత్యరాజ్ (ఐఆర్ఎస్, ఉత్తరప్రదేశ్), యశ్ సురేకుమార్ కాలె (ఐఎఫ్ఓ, మహారాష్ట్ర), హరిప్రశాంత్ (ఐపీఎస్, తమిళనాడు), మాన్సీ రాజీవ్ గోఖలె (ఐసీఎల్ఎస్, గుజరాత్) సందర్శించగా.. ఎంపీడీఓ విజయ్‌కుమార్, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

- మహబూబ్‌నగర్ మండలంలోని మణికొండలో ట్రెయినీ అధికారులు గౌరవ్ గోస్వామి (ఐపీఎస్, ఝార్ఖండ్), కన్నెధార మనోజ్‌కుమార్ (ఐపీఎస్, వెస్ట్‌బెంగాల్), ఆకాష్ కుమార్‌శర్మ (ఐడీఈఎస్, మధ్యప్రదేశ్), టి.అంకిత్ (ఐఆర్ఎస్, హర్యానా), అరిరిహంత్ కోచార్ (ఐఎఫ్ఓఎస్, మధ్యప్రదేశ్) సందర్శించగా.. మండల అధికారులతో పాటు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.
- నవాబుపేట మండలంలోని తీగలపల్లి గ్రామాన్ని ట్రెయినీ అధికారులు కంబాలె శరణ్ గోపీనాథ్ (ఐపీఎస్, మహారాష్ట్ర), కుమార్ సుభం (ఐఎఫ్ఓ, జార్ఖండ్), సౌమ్యమిశ్ర (ఐఎస్ఎస్, ఉత్తరప్రదేశ్), విశాఖగుప్తా (ఐఈఎస్, ఢిల్లీ), అశుతోష్ గుప్తా (ఐపీటీఏఎస్, మధ్యప్రదేశ్) సందర్శించగా.. గ్రామస్తులు పూలవర్షం కురిపించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. వారి వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాం నాయక్, భద్రునాయక్, నరేందర్ ఉన్నారు.
- కోయిల్‌కొండ మండలంలోని దమాయపల్లిని ట్రెయినీ అధికారుల బృందం సందర్శించింది. నాలుగు రోజులపాటు వారు గ్రామంలోనే ఉండి అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించనున్నారు. తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ కాళప్ప, ఎంపీఓ నజీర్ హైమద్, ఏపీఓ నర్సయ్య వారికి స్వాగతం పలికారు.
- దేవరకద్ర మండలంలోని గుడిబండలో ట్రైనీ అధికారులు అజయ్ కుమార్ ఐఏఎస్, వివేక్ ప్రవీన్ కుమార్ ఐపీఎస్, దీక్షిత మీనన్ ఐఆర్ఎస్, యోగేంద్ర మోహన్ ఐఎఫ్ఎస్, ఆస్తా ఐఆర్ఎస్ ఐటీ క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. మండల అధికారులు వారికి ఘనస్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, కాంగ్రెస్ నాయకులు గౌని అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'మాజీ సర్పంచ్ ఆత్మహత్యపై స్పందించాలి'


మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: సీఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య ఘటనపై స్పందించాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈ ఘటనకు కారణం సీఎం కుటుంబ సభ్యులే అంటూ నోట్ రాసిన కూడా ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆమె నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహారాష్ట్రలో మోదీపై ఉన్న విశ్వాసంతోనే ప్రజలు ఎన్‌డీఏ కూటమికి అధికారం కట్టబెట్టారని, అన్ని రంగాల్లో కూడా మహారాష్ట్ర దేశానికి వెన్నెముక వంటిందని, అలాంటి రాష్ట్రంలో బీజేపీ గ్రేట్ విక్టరీ సాధించడం గర్వకారణమన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని కాంగ్రెస్ పార్టీ కాలికి గజ్జె కట్టుకొని ప్రచారం చేశారని, తెలంగాణ సీఎం వెళ్లి పెద్ద పెద్ద స్పీచ్‌లు ఇచ్చినా.. తెలంగాణ మోడల్ అంటూ చేసిన ప్రచారం బోగస్ అని తేలిపోయిందని, తెలంగాణలో శఠగోపం పెట్టారని అక్కడి ప్రజలు గుర్తించి తీర్పు ఇచ్చారన్నారు. మహారాష్ట్రలో గెలుపు కోసం కాంగ్రెస్ చేసిన కుట్రలు పనిచేయలేదని, రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టే సెంటిమెంట్ రాజకీయం చేశారని, కానీ ఆ ప్రాంత ప్రజలు బీజేపీపై నమ్మకం ఉంచారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ దేశంలో ఐక్యతను దెబ్బతీసే విధంగా ప్రసంగాలు చేశారని దుయ్యబట్టారు. అంతకు ముందు మహారాష్ట్రలో ఎన్‌డీఏ మిత్రపక్షం గెలుపును పురస్కరించుకొని ఎంపీ నివాసం ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఆ తర్వాత పార్టీ నేతలు ఎంపీ డీకే అరుణకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి శివారు 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాజాపూర్‌కు చెందిన బుక్క గోపాల్ (59) జాతీయ రహదారిని శుభ్రం చేసే యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. గొల్లపల్లి శివారులో జాతీయ రహదారిపై మిషన్‌ను నిలిపి అందులోని రాళ్లు, చెత్తను తొలగిస్తున్నాడు. అదే సమయంలో కర్నూలు వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి క్లీనింగ్ మిషన్‌ను ఢీకొట్టగా ముందుభాగంలో ఉన్న గోపాల్‌పై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

దుందుభీలో వింత చేపలు


డెవిల్ ఫిష్


పొడవాటి మలగమేను రకం చేప

దుందుభీ వాగులో ఓ మత్స్యకారుడికి వింత చేపలు చిక్కాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కాంసానిపల్లి సమీపంలోని దుందుభీ వాగులో అదే గ్రామానికి చెందిన చీమర్ల మణిందర్ శనివారం చేపల కోసం వల విసిరాడు. అయితే వలకు రెండు వింత చేపలు చిక్కాయి. ఇందులో ఒకటి పాము ఆకారంలో పొడవుగా మలగమేను.. మరోటి సక్కర్ మౌత్ (డెవిల్ ఫిష్) చేప చిక్కింది. ఈ రకం చేపలు అరుదుగా లభిస్తాయని.. వీటిని ఔషధాల తయారీకి ఉపయోగిస్తారని తెలిసింది. వింత చేపలు లభించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– ఉప్పునుంతల

కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య

- సహకరించిన కుటుంబసభ్యులు


ఈశ్వరయ్య (ఫైల్)

తెలకపల్లి: కట్టుకున్న భర్తకు తోడు నీడగా ఉండాల్సిన భార్య కుటుంబ సభ్యులతో కలిసి దారుణంగా హత్యచేసిన ఘటన మండలంలో శనివారం వెలుగు చూసింది. నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య కథనం మేరకు.. మండలంలోని వట్టిపల్లికి చెందిన మూడిండ్ల ఈశ్వరయ్య (56)కు గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో 3.33 ఎకరాల పొలం ఉంది. ఈయనకు భార్య ఎల్లమ్మ, ఐదుగురు కుమార్తెలు స్వాతి, కవిత, సమీర, శివమ్మ, రేణుక ఉండగా ఇద్దరి వివాహం అయింది. ఒక ప్రాంతంలో ఉన్న 2.14 ఎకరాల భూమి విక్రయించి మిగిలిన కుమార్తెల వివాహాలు, ఇల్లు నిర్మించుకోవాలని ఈశ్వరయ్య అనుకున్నాడు. ఇందుకు భార్య ఒప్పుకోకపోవడంతో కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవ జరుగుతుంది. శుక్రవారం రాత్రి ఇంట్లో పడుకున్న ఈశ్వరయ్యను అర్ధరాత్రి దాటిన తర్వాత భార్య ఎల్లమ్మ, కుమార్తె స్వాతి, అల్లుడు మల్లేష్, బావమరిది బాలస్వామి, మరదలు ఆశమ్మ కలిసి గొడ్డలితో నరికి హతమార్చి పరారయ్యారు. శనివారం ఉదయం ఇంటిపక్కల వారు చూసే సరికి ఈశ్వరయ్య రక్తపు మడుగులో చనిపోయి కనిపించాడు. ఈశ్వరయ్య చెల్లెలు నిర్మల ఫిర్యాదు మేరకు ఎల్లమ్మ, స్వాతి, మల్లేష్, బాలస్వామి, ఆశమ్మపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడంతో శనివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ప్రతిపక్షాలు అనవసరంగా చావును సైతం రాజకీయాలకు వాడుకోవటం సిగ్గుచేటని.. కాంగ్రెస్‌పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

సమగ్ర విచారణ జరిపించాలి..

సాయిరెడ్డి ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు వేరైనా చట్టాలు అందరికీ ఒక్కటేనని.. మృతిపై ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ చేపట్టాలన్నారు. 85 ఏళ్ల వయసులో ఒక మనిషి ఆత్మహత్య చేసుకున్నాడంటే సీఎం సోదరులు ఎంత ఇబ్బంది పెట్టారో అర్థమవుతుందని తెలిపారు. మరణ వాంగ్మూలాన్ని ఉత్తరం రూపంలో తెలియజేసినా.. మృతికి కారణమైన వారందరిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మనస్తాపంతోనే సాయిరెడ్డి ఆత్మహత్య


మాట్లాడుతున్న కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు.. పాల్గొన్న సీఐలు

- కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు

కల్వకుర్తి టౌన్: ఇంటికి దారి ఉండదేమోనన్న ఆలోచనతో తీవ్ర మనస్తాపానికి గురై వంగూర్ మండలం కొండారెడ్డిపల్లికి చెందిన సాయిరెడ్డి (85) ఆత్మహత్య చేసుకున్నారని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లకు వివరాలు వెల్లడించారు. సాయిరెడ్డి 1981, 1988 రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేశారు. ఇతడి ఇంటికి వెళ్లే వేరే దారిలో పశువుల ఆస్పత్రికి సంబంధించిన ట్రేవీస్ ఏర్పాటును అడ్డుకోవడంతో అధికారులు, గ్రామస్తులు అతడికి నచ్చజెప్పారు. శుక్రవారం తిరిగి పనులు చేస్తుంటే మరళ అడ్డుకోగా ఎస్ఐ, సిబ్బంది అతడికి నచ్చజెప్పి ఇంటి దగ్గర వదిలారు. కుటుంబసభ్యులు సైతం నచ్చజెప్పినా వినలేదు. సర్పంచ్‌గా పనిచేసినా తనకు గౌరవం లేకుండా పోయిందని శుక్రవారం మధ్యాహ్నం గ్రామం నుంచి కల్వకుర్తికి వచ్చి బస్టాండ్ సమీపంలో పురుగు మందు కొనుగోలు చేశాడు. రఘుపతిపేట రోడ్డు వైపునకు వెళ్లి వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగి అక్కడే పడిపోగా చూసినవారు బ్లూకోర్ట్ సిబ్బందికి సమాచారం అందించారు. వారితో పాటు కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కుమారుడు మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి లేఖ దొరకలేదని.. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని వివరించారు.

గొర్రెల అపహరణ: కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపరి రేణయ్యకు చెందిన 16 గొర్రెలను అపహరించారు. తన ఇంటి సమీపంలోని పాకలో రోజు మాదిరిగానే గొర్రెలను ఉంచగా, అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తు కెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. వాటి విలువ సుమారు. రూ.1.40లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చోరీ కేసు నిందితుడి అరెస్టు

- రూ. 3.10 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: కారు అద్దాలను ధ్వంసం చేసి నగదు కాజేసిన నిందితుడిని అదుపులోకి తీసుకొని రూ. 3.10లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న అలంపూర్ మండలం ఇమాంపూర్‌కు చెందిన కుర్వ సిద్ధన్న జిల్లా కేంద్రంలో తన ప్లాట్‌ను రూ. 3.60 లక్షలకు విక్రయించారు. ఆ నగదుతో కారులో స్వగ్రామానికి వెళ్తూ.. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో భోజనం చేసేందుకు ఆగారు. నగదును కారులోనే పెట్టి హోటల్‌కు వెళ్లిన క్రమంలో నెల్లూరు జిల్లా బిట్రాగుంట గ్రామానికి ప్రసంగి మరో ముగ్గురు కారు అద్దాలను ధ్వంసం చేసి, కారు డిక్కీలో దాచిపెట్టిన నగదు బ్యాగును అపహరించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం ఎర్రవల్లి చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రసంగిని పోలీసులు గుర్తించి విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించారు. నిందితుడి నుంచి రూ. 3.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిరుద్యోగిని మోసం చేసిన మహిళకు రిమాండ్ ..

ఉద్యోగం పేరుతో నిరుద్యోగిని మోసం చేసిన మహిళను అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. గద్వాలకు చెందిన చాకలి చిన్ననర్సింహ ఓ పాఠశాలలో ఒప్పంద పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అక్కడే పనిచేస్తున్న వనపర్తి జిల్లా వాసి సరిత, ఆమె భర్త జగదీశ్వర్‌రెడ్డి రైల్వేశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని చాకలి చిన్ననర్సింహ్మను నమ్మించి రూ. 6లక్షలు వసూలు చేశారు. ఉద్యోగ విషయంపై బాధితుడు ప్రశ్నిస్తే, త్వరలో వస్తుందని నమ్మించే ప్రయత్నం చేశారు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శనివారం వనపర్తిలో నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, తాను చేసిన మోసాన్ని అంగీకరించిందన్నారు. నిందితురాలిని గద్వాల కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న నగదును కోర్టు అనుమతితో బాధితుడికి త్వరలో అప్పగిస్తామని వెల్లడించారు. కాగా, రెండు ప్రధాన కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, సీఐ శ్రీనుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పట్టణ, రూరల్ ఎస్‌లు కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్, ఐటీ సెల్ ఎస్ఐ రజిత, సాంకేతిక నిపుణులు చంద్రయ్య, ఇస్మాయిల్, బాషా, రామకృష్ణలు కీలకంగా వ్యవహరించారని ఎస్పీ తెలిపారు. వారికి రివార్డులను అందజేశారు.